క్లుప్తంగా

నేడు బీఎల్‌ఓల సమావేశం

బంట్వారం: ఓటరు నమోదు ప్రక్రియపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బీఎల్‌ఓలతో సమీక్షా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి బీఎల్‌ఓలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పేద విద్యార్థినులకు ప్రోత్సాహకం



ప్రోత్సాహకం అందజేస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: పేద విద్యార్థినులను చదువులో ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందజేసినట్లు కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ సురేష్ కుమార్ అన్నారు. గురువారం శివారెడ్డిపేట్ ఉన్నత పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులకు ఒక్కొక్కరికీ 'కెనరా విద్యా జ్యోతి' పథకం కింద రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా బ్యాంకు కస్టమర్లకు ఎన్నో సేవలు అందిస్తూ ఆదరాభిమానాలను చూరగొంటుందని చెప్పారు. కార్యక్రమంలో వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్ గంగాధర్, సంజీవులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి పరామర్శ



ఏసును పరామర్శిస్తున్న నాయకులు

యాలాల: విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పగిడిపల్లి గ్రామానికి చెందిన ఏసును గురువారం బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు పరామర్శించారు. నగరంలో సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న ఏసు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితున్ని గాంధీకి తరలించగా, రెండు కాళ్లను తొలగించారు. పేద కుటుంబానికి చెందిన ఏసును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. పరామర్శించిన వారిలో గ్రామానికి చెందిన కోస్గి వెంకటేశ్, రాములు, చిన్న రాములు, అంజిలప్ప, మహిపాల్, ఎర్రమోహన్ తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపీ కేంద్రం ప్రారంభం



క్యాంపును ప్రారంభించిన ఎంఈఓ

మోమిన్‌పేట: దివ్యాంగ విద్యార్థులు ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ గోపాల్ కోరారు. గురవారం మండల కేంద్రంలో ఫిజియోథెరపీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ఈ క్యాంపును ఏర్పాటు చేశామని, గతంలో రెగ్యులర్‌గా కొనసాగిన సెంటర్‌ను తిరిగి ప్రానరంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

పచ్చదనం పెంపొందిస్తేనే భవిష్యత్



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్

అనంతగిరి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని వికారాబాద్ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ మాలిని అన్నారు. ఈ మేరకు గురువారం వికారాబాద్ అనంతగిరిగుట్టలోని మెడికల్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. హరితహారంతో గ్రామాలు, పట్టణాలు పచ్చగా మారుతున్నాయని పేర్కొన్నారు. మొక్కలు నాటి, పచ్చదనం పెంచితేనే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని చెప్పారు. అనంతగిరి లాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో మెడికల్ కళాశాల ఉండటం ఎంతో సంతోషకరమన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య, వైద్యులు పాల్గొన్నారు.

ఒంటరిగానే పోటీ

కొడంగల్: వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ సమన్వయకర్త తమ్మళి బాలరాజ్ అన్నారు. గురువారం ఆయన పార్టీ స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందారని, రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్‌ఆర్‌టీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, అవినీతి పాలనకు, అవినీతి పరులకు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని చెప్పారు.

కార్మికులకు బీమా భరోసా

గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ కార్మికులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డిమాండ్లు నెరవేర్చుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 34 రోజులుగా వారు చేపట్టిన వారి సమ్మెకు స్పందించింది. కార్మికులు చనిపోతే తక్షణ సహాయం కింద రూ.10వేలు చెల్లింపుతో పాటు.. ఒక్కొక్కరికి రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తూ సర్కారు భరోసా కల్పించింది.

- ఉచితంగా ఇన్స్యూరెన్స్‌కు ప్రభుత్వ నిర్ణయం
- అంత్యక్రియలకు రూ.10వేలు
- ఉత్తర్వులు జారీ



చెత్త తరలిస్తున్న పంచాయతీ కార్మికులు(ఫైల్)

దౌల్తాబాద్: పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం బీమాతో భరోసా కల్పించింది. అనారోగ్యంతో చనిపోయిన కార్మికునికి తక్షణ సహాయం పెంచడంతో పాటు ఉచితంగా ఇన్స్యూరెన్స్ కల్పిస్తూ ఈనెల 14న ఉత్వర్వులు జారీ చేసింది. గ్రామాల్లో మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య తదితర పనులు చేస్తుంటారు. పాచి పనులు చేసే కార్మికులు అనారోగ్యాల బారిన పడి చనిపోయినా ఇంతకు ముందు ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం రూ.5వేలు మినహా.. బీమా ఉండేది కాదు. కానీ ప్రస్తుతం కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రీమియం డబ్బులు పంచాయతీనే భరించి, కార్మికులకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టింది. పథకం కింద నమోదైన కార్మికుడు మరణిస్తే నామినీకి రూ.5లక్షల బీమా డబ్బులు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందుకు అనుగుణంగా బీమా ప్రీమియం చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

119 మందికి ప్రయోజనం

పంచాయతీ కార్మికులకు ఉచితంగా బీమా సౌకర్యం అమలులోకి వస్తే మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 119 మంది కార్మికులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే పంచాయతీ అధికారులు గ్రామపంచాయతీల వారీగా పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలను జీపీ కార్యదర్శుల నుంచి సేకరిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే బీమా ప్రీమియానికి సంబంధించిన డబ్బులను పంచాయతీల నుంచి చెల్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. గతంలో పంచాయతీ కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల కోసం రూ.5వేలు మాత్రమే ప్రభుత్వం నుంచి అందించేవారు. తాజాగా ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచింది. ఈ మొత్తాన్ని సైతం పంచాయతీ నిధుల నుంచే చెల్లించనున్నారు.

ఆదేశాలు రాలేదు



గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. అవి రాగానే బీమా సౌకర్యం అమలయ్యేలా చూస్తాం. ఇప్పటికే కార్మికుల వివరాలు సేకరించాం.

– రవీందర్, ఎంపీఓ

అవగాహన లేమితో అనారోగ్యం

- ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి
- వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్య పరీక్షలు చేసుకోకపోవటం, మందులు వాడకపోవటం వలన అనారోగ్యం పాలవుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ధారూరు మండలం కుక్కిందలో గురువారం 'చేవెళ్ల ఆరోగ్య రథం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. అవగాహన లేమితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, బీపీ, షుగర్ గుండెపోటు లాంటి రుగ్మతలు రాకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యులు సూచించిన మందులు వాడాలని సూచించారు. ఎంపీ రంజిత్ రెడ్డి నిర్వహిస్తున్న ఇలాంటి ఆరోగ్య శిబిరాల్లో వివిధ రకాల పరీక్షలు చేసి, అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజునాయక్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంతోష్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, రాజుగుప్తా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

దోమ: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి, అర్హులకు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని సర్పంచ్ కోళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములు అన్నారు. గురువారం దోమ మండలం బొంపల్లిలో దివ్యాంగులకు పింఛన్ పెంపును హర్షిస్తూ తపాలా కార్యాలయం ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబం ఉన్నతమైన జీవతాన్ని ఆస్వాదించేందుకు వివిధ పథకాలను తీసుకువచ్చి, నేరుగా అందిస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు రూ.3,016 ఉన్న పింఛన్‌ను రూ.4,016 పెంచి ఎంతో ఆసరాగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఫిక్ పాష, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్, మైనార్టీ సంఘం గ్రామ అధ్యక్షుడు తాహెర్ పాష, రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు షేర్‌ఖాన్, నాయకులు మోహిన్, షఫీ, ఖలీల్, వెంకటేశ్, వెంకటయ్య, మల్లేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, జెడ్పీటీసీ తదితరులు

మర్పల్లి: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జెడ్పీటీసీ మధుకర్, పట్లూర్ సర్పంచ్ ఇందిర అశోక్ అన్నారు. గురువారం గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను జెడ్పీటీసీ, సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే పట్లూర్ రూపురేఖలు మారాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు మిషన్ భగీరథతో ఇంటింటికీ సరిపడా తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రూ.25 లక్షలతో సీసీరోడ్లు వేశామని, దీంతో గ్రామంలో వ్యవసాయ పంట ఉత్పత్తులు పెరిగాయని తెలిపారు. మరిన్ని నిధులతో గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మోయిజ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, గ్రామస్తులు శంకర్, రాచయ్య, జీవన్, శ్రీహరి, ప్రశాంత్ వికాస్ తదితరులు ఉన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి



కమ్యూనిటీ భవనం పనులను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌గుప్తా తదితరులు

మర్పల్లి: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్, మర్పల్లి హనుమాన్ మందిరం చైర్మన్ ప్రభాకర్‌గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద భజన మండలి భక్తుల కోసం కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు ఎమ్మెల్యే ఆనంద్ ఎస్టీఎఫ్ నిధుల కింద రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు జెడ్పీటీసీ పబ్బే మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డితో కలిసి ప్రభాకర్‌గుప్తా పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, అడ్వకేట్ మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గఫార్, సహకార సంఘం డైరెక్టర్ గౌస్, వార్డు సభ్యులు, ఆలయ ఉత్సవ కమిటి సభ్యులు తదితరులు ఉన్నారు.

'మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి'

పరిగి: ఉద్యాన శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యాన విస్తరణ అధికారులుగా పని చేసిన తమను కరోనా సమయంలో తొలగించారని, మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఆ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. 15 సంవత్సరాలుగా ఉద్యాన శాఖలో విస్తరణ అధికారులుగా రైతులకు సేవలను అందించామని, బిందు, తుంపర సేద్యం, వివిధ పండ్ల తోటల పెంపకంపై క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించామని చెప్పారు. తక్కువ వేతనంతో పనిచేశామని, కరోనా సమయంలో మా ఉద్యోగాల కాల పరిమితి రెన్యూవల్ చేయని కారణంగా రోడ్డున పడ్డామని వాపోయారు. తమను విధుల్లోకి తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రాంరెడ్డి, బాబ్యానాయక్, రాజేందర్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

వారికి సముచిత స్థానం

ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలంలోని 200 మంది వివిధ పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యే నివాసంలో అధికార పార్టీలో చేరారు. మందిపాల్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సునిత కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా, మరి కొంత మంది బీజేపీని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చిన వారు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. వారికి ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని చేయాలని సూచించారు.

మహిళల రక్షణే షీ టీం ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్

యాలాల: మహిళల రక్షణే ధ్యేయంగా షీ టీం విధులు నిర్వహిస్తుందని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, షీ టీం ఇన్‌చార్జి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్ మాట్లాడారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బస్టాండ్లలో ఆకతాయిల వేధింపులను ఈ టీం చాలా వరకు నివారించిందని పేర్కొన్నారు. ఎవరైనా యువతులను, మహిళలను వేధిస్తే డయల్ 181, 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాను పూర్తి చేయాలి

తహసీల్దార్ పురుషోత్తం

దోమ: బీఎల్‌ఓలు ఓటరు జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. గురువారం దోమ మండల కేంద్రంతో పాటు పాలేపల్లి, అయినాపూర్, మోత్కూర్ గ్రామాల్లో పోలింగ్ బూత్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే గ్రామ ప్రజా ప్రతినిధులతో కలిసి బీఎల్‌ఓలు సవరించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. అక్టోబర్ 1వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు కృషి చేయాలన్నారు. ఆగస్టు 26, 27వ తేదితో పాటు సెప్టెంబర్ 2,3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌గా నిర్వహిస్తున్నామని, పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని సూచించారు. అక్టోబర్ 1న ఎలక్షన్ కమిషన్ అనుమతితో అక్టోబర్ 4న ఓటరు జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐ లింగం, బీఎల్‌ఓలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మోత్కూర్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

'చంద్రయాన్' సంబురాలు



శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులు

పరిగి: చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడంతో గురువారం పట్టణ కేంద్రంలోని పలు పాఠశాలు, కళాశాలల్లో సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థులు చంద్రయాన్ జయకేతనంపై స్లోగన్‌లు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులకు చంద్రయాన్ చంద్రుడిపై ప్రవేశించిన అనంతరం చేసే పనులను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు దళిత డిక్లరేషన్ సభ

కుల్కచర్ల: ఈ నెల 26న నిర్వహించే దళిత, గిరిజన డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణకు మొదటి సీఎంను దళిత వ్యక్తినే చేస్తానని చెప్పి మోసం చేశారని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. గిరిజనులందరికీ పోడుభూములు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. కొందరికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొందని ఆరోపించారు. శనివారం చేవెళ్లలో జరిగే సభకు పార్టీ శ్రేణులు భారీగా హాజరు కావాలన్నారు.

ప్రజాగర్జనకు తరలిరండి

దౌల్తాబాద్: ఈ నెల 26న చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు రానున్నారని, కావున మండలం నుంచి 5వేల మంది కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

వానకోసం ఎదురుచూపు

మోమిన్‌పేట: సాగు చేసిన పంటలు ఎండు ముఖం పడుతున్నాయని, కరుణించు వరుణ దేవుడా అని రైతులు వేడుకుంటున్నారు. జూన్ నెలలో వర్షాలు పడక జులై మొదటి వారంలో విత్తనాలు విత్తుకొన్నారు. అవి కాస్త మొలక దశలో ఉన్నప్పుడు జులై మూడో వారం నుంచి వర్షాలు దంచి కొట్టడంతో మొలిచిన మొలకలు కాస్త ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోయింది. తిరిగి కోలుకుంటున్న సమయంలో 20 రోజులుగా వానలు కనుమరుగయ్యాయి. దీంతో కర్షకులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వస్తే ఎకధాటి, లేకపోతే రెండుమూడు వారాలు వర్షాలు తిరిగి రావటం లేదని, పంటల ఎదుగుదల ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న కండే విత్తుకొంటున్న సమయంలో వర్షాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పవని, ఈ సమయంలో వర్షాలు చాలా అవసరమని పేర్కొంటున్నారు.

'దళితబంధు'ను వినియోగించుకోవాలి

మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకాన్ని దళితులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పబ్బే మధుకర్ అన్నారు. గురువారం మర్పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన పవన్ అనే యువకునికి దళితబంధు పథకం కింద పౌల్ట్రీ ఫాం మంజూరు కాగా.. ఫాంను వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డితో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. చదువుకున్న యువత ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, తుమ్మలపల్లి ఎంపీటీసీ మల్లేశం, పిల్లిగుండ్ల సర్పంచ్ పాండు, మాజీ సర్పంచ్ అనిల్ గ్రామస్తులు సర్దార్, దళిత బంధు యూనిట్ లబ్ధిదారుడు కుటుంబ సభ్యులు ఉన్నారు.

స్వీపర్‌కు పోలీసుల ఆర్థిక సహాయం

మర్పల్లి: పీఎస్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న రాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల రాజుకు గుండెకు శస్త్రచికిత్స అయింది. విశయం తెలుసుకున్న మర్పల్లి పోలీస్ బృందం గురువారం బాధితునికి రూ.10 వేలు అందజేసినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కొడంగల్ రూరల్: సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు గురువారం పట్టణంలోని ఎంఆర్సీ భవనం ఎదుట వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 13 ఏళ్లుగా విద్యాశాఖలో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

కార్మికులను మరిచిన ముఖ్యమంత్రి



మునిసిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

- కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి
- ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ వికారాబాద్ అధ్యక్షుడు చెన్నయ్య

వికారాబాద్ అర్బన్: తెలంగాణ ఉద్యమ సమయంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతి ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్.. ఆ తరువాత కార్మికులను పూర్తిగా మరిచిపోయారని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ వికారాబాద్ అధ్యక్షుడు చెన్నయ్య విమర్శించారు. గురువారం మున్సిపాలిటీలో పని చేసే 243 మంది పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను, ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజులుగా తమ డిమాండ్లపై ప్రతిరోజు మధ్యాహ్నం వరకు విధులు ముగించుకొని, మధ్యాహ్నం నుంచి సమ్మె చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని వాపోయారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకుంటే సెప్టెంబర్ 1 నుంచి విధులు నిర్వహించకుండా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఇందులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నాగేందర్ రెడ్డి ఉన్నారు.